
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
మంగళవారం 2 ఏప్రిల్ 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం సా: 6.35 గం.
సహర్ : బుధవారం ఉ: 4.46 గం.





- మిర్చి సాగులో తీవ్ర నష్టం
- చీడ పురుగులు, తెగుళ్లతో భారీగా తగ్గిన దిగుబడి
- మార్కెట్లలో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు
- పెట్టుబడి కూడా రావడం లేదని ఆందోళన

రైతన్నకు తీరని వేదన

ఏటూరునాగారం/వాజేడు, ఏప్రిల్ 1: మిర్చి రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. పంట చేతికి వచ్చే సమయానికి తెగుల బారిన పడటంతో దీనావస్థకు చేరుకున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈఏడాది ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగుడెం, మంగపేట మండలాల రైతులను చీడపీడలు తీవ్రంగా ముంచేశాయి. నల్లి తెగులు, తామరపువ్వు తెగులు పంటలకు సోకడంతో కర్షకులు తీవ్రంగా నష్టపోయారు. కళ్లెదుటే పూత రాలిపోయి మిర్చి మొక్కలు వాడిపోతుడడంతో కంటతడి పెడుతున్నారు. పెట్టుబడులు కూడా ఈసారి వస్తాయో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీ మండలాల్లో వరి సాగు భారీగా తగ్గిపోయింది. గత ఏడాది మిర్చి ధరలు అధికంగా ఉండటంతో అత్యధిక మంది రైతులు ఈ ఏడాది పరిమితికి మించి ఆ పంటనే సాగు చేశారు. ఒక్క వాజేడు మండలంలోనే సుమారు 8 వేల ఎకరాల్లో మిర్చిని పండిస్తున్నారు. వరి మాత్రం 500 ఎకరాలలోపే సాగు అవుతోంది. వరి పంటకు పెట్టుబడులు ఎక్కువ అవుతుండటం ఒక కారణం కాగా మార్కెట్‌లో ధాన్యానికి ధర కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో రైతులు ఆ సాగుపై అంతగా ఆసక్తి చూపటం లేదు. దీంతో లాభాలు అధికంగా వచ్చే మిర్చి పంటను సాగు చేయగా అది కూడా ఈ ఏడాది నష్టాలను మిగల్చింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. మిర్చి మొక్కలు ఈసారి తొలిపూత పూసి కొత దశకు వచ్చే సమయంలో నల్లి తెగులు, తామర పురుగు తెగులు సోకింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా పురుగుల ఉధృతి తగ్గకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఏటూరునాగారంలోని వ్యవసాయ మార్కెట్లో రైతులు ఆరబోసిన మిర్చి

పెరిగిన పెట్టుబడులు

వాణిజ్య పంటైన మిర్చిని సాగు చేసేందుకు రైతులకు ఈసారి పెట్టుబడుల భారీగా పెరిగిపోయాయి. ఎకరం పంటకు అన్ని ఖర్చులు కలుపుకొని రూ. లక్ష 50 వేలు అయ్యాయి. కూలీలు, పురుగు మందులు, విత్తనాలు, కౌలు ధరలు సైతం అమాంతంగా పెరగటంతో పెట్టుబడులు భారీగా అవుతున్నాయని రైతులు అంటున్నారు. పంటను సకాలంలో కోసేందుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి కూలీలను తీసుకు రావటం కూడా పెనుభారం పడుతోందని అంటున్నారు.

ఎగుమతులపై ఆంక్షలు

మిర్చి ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ఆ ప్రభావం మిర్చి రైతులపై తీవ్రంగా పడింది. ఎన్నడూ లేని విధంగా మిర్చి పంటను విదేశాలకు ఎగుమతులను నిలిపివేయటంతో దేశీయంగా పంట నిల్వలు పెరిగిపోయాయి. గత ఏడాది పండించిన పంటను అధిక ధర వస్తుందేమోనని రైతులు కోల్డ్‌స్టోరేజీల్లో భద్రపరుస్తారు. గత ఏడాది రూ. 25వేలకు పైగా ఉన్న మిర్చి ధర ఇంకా పెరుగుతుందేమోనని ఎదురుచూశారు. మిర్చికి డిమాండ్ లేకపోవడంతో ఎక్కడి నిల్వలు అక్కడే ఉండిపోయాయి. ప్రస్తుతం ఈ ఏడాది పండించిన పంటకు సైతం కోల్డ్‌స్టోరేజీల్లో చోటు లేకపోవడంతో ఏం చేయాలో తోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చైనాకు తరలించే మిర్చి ఎగుమతులపై ఆంక్షలు విధించడం, ఆ దేశం ఇతర దేశాల నుంచి మిర్చి కొనుగోలు చేస్తుండటం కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని కొంత మంది రైతులు అంటున్నారు. చీడ పీడలతోపాటు మరో వైపు వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, ఈ ఏడాది ఆరంభంలోనే గోదావరి వరదలు రావటంతో కుళ్లు తెగుళ్లు వ్యాపించి మిర్చి పంటలు సరిగా పండలేదని, ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్లకు మాత్రమే దిగుబడి వచ్చిందని చెబుతున్నారు. క్వింటాకు కనీసం రూ. 25 వేలు ధర పలికితేనే తాము పెట్టిన పెట్టుబడికి గిట్టుబాటు అవుతోందంటున్నారు.

తగ్గిన దిగుబడులు

తెగుళ్లతో నాశనమైన రైతులు దిగుబడులు లేక మరింతగా దిగాలు చెందుతున్నారు. ఒక్కో ఎకరానికి ఐదు క్వింటాళ్లలోపే పంట పండటంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఎకరానికి సుమారు 20 క్వింటాళ్లు దిగుబడి రాగా ఈసారి అదే ఎకరానికి ఐదు క్వింటాళ్లే పంట పండిందని అంటున్నారు. మిర్చి పంటను మూడు కోతలు కోసే రైతులు ఈ ఏడాది ఒక్క కోతతోనే సరిపెట్టుకున్నారు. తోటల్లో కాయలు లేకపోవడం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేకపోవడంతో పంటను మధ్యలోనే వదిలేసిన సందర్భాలూ ఉన్నాయి.

పడిపోయిన ధరలు

వరంగల్ మార్కెట్‌లో మిర్చి ధరలు అమాంతం పడిపోయాయి. ఈ ఏడాది ఆరంభంలో క్వింటా మిర్చికి రూ. 24వేల వరకు ఉన్న ధరలు నెల రోజులుగా రూ. 10వేల లోపే పలుకుతోంది. దీంతో రైతన్నలు వచ్చిన ధరకే విక్రయిస్తూ ఆ డబ్బులతో అప్పులు తీర్చుకునే పనిలో ఉన్నారు. గత ఏడాది మిర్చి ధరలు వరంగల్ మార్కెట్‌లో రూ. 25 వేల నుంచి రూ. 30 వేలకు వరకు పలికింది. ఈసారి మార్కెట్ అదే ధర ఉండటంతో రైతులకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం మార్కెట్‌లో జెండా పాట రూపంలో రూ. 15వేల వరకు ఉంటుండగా దళారులు మరింతగా తక్కువ చేసి రూ. 8వేలు, రూ. 9వేలకు వరకు ధర చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని హార్టికల్చర్ అధికారులు

మిర్చి పంటను సాగు చేసే రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాల్సిన అధికారులు జాడ లేకుండా పోయారు. జిల్లాలో హార్టికల్చర్ (ఉద్యాన శాఖ) అధికారులు పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెగుళ్ల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులు వివరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం ప్రయత్నించడం లేదని తెలుస్తోంది.

దొంగతోనే కండువా కప్పించుకుంటివి..

- గతంలో రేవంత్‌రెడ్డిని దొంగ అన్న కడియం
- నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- కాంగ్రెస్‌వి ఉద్దెర వాగ్దానాలు తప్ప.. ఉద్ధరించిందేమీ లేదు..
- బీజేపీ మాట వింటే జోడీ.. లేదంటే ఈడీ..
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి..
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు


వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రాంనగర్, ఏప్రిల్ 1: 'రేవంత్‌రెడ్డి ఓ మోసకారి, దొంగ అని గతంలో విమర్శలు చేస్తివి.. ఇప్పుడు ఆ దొంగతోనే కాంగ్రెస్ కండువా కప్పించుకుంటివి' అని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం చింతగట్టు క్యాంపు వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పార్టీని వీడాడ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగిందని, పార్టీకి ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెప్పాలనే కసి ప్రతీ కార్యకర్తలో వచ్చిందన్నారు. ఆయనకు బీఆర్ఎస్ ఎంతో చేసిందని, నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇక ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌వి ఉద్దెర వాగ్దానాలే తప్ప ఉద్ధరించిందేం లేదని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా నిరుద్యోగ భృతి, రుణమాఫీ, కల్యాణలక్ష్మి తులం బంగారం, రైతుబంధు, రూ.4వేల పింఛనును సీఎం గాలికి వదిలేశాడని, రేవంత్‌రెడ్డివి తుపాకీరాముడి మాటలని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడంలో భాగంగానే రాష్ట్ర అధికార చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగించాలనే నిర్ణయం తీసుకున్నారని,ఈ కళాతోరణం వరంగల్ ఆత్మగౌరవ ప్రతీకని, తొలగిస్తే వరంగల్ అగ్నిగుండమవుతుందని హెచ్చరించారు. ఇక బీజేపీ మాట వింటే జోడీ.. లేదంటే ఈడీ.. అని, నల్లధనం డబ్బులు వెలికితీసి ప్రతీ ఒక్కరి అకౌంట్లో రూ.15లక్షలు వేస్తానని, ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి దశాబ్దకాలం అవుతున్నా బీజేపీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. దేవుడి పేరు చెప్పుకుని రాజకీయం చేయడం ఎంతవ రకు సమంజసమని ప్రశ్నించారు. అందరికీ దేవుడంటే భక్తి ఉంటుందంటూ వేదికపైనే హనుమాన్ చాలీసా చదివారు. పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదన్న ఆయన ఉద్యమకారులకు అవకాశాలు కల్పిస్తామని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని శ్రేణులకు భరోసానిచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. పైరవీకారులు, బ్రోకర్లు

మిగతా 8వ పేజీలో...

వరంగల్ ప్రజలు ఆశీర్వదించండి..
- ఎంపీగా గెలిపిస్తే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి
- ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి బాబుమోహన్

7



బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్‌లో చేరా..
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజును కలిసిన కడియం

7



వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్దపీట
- పలు స్కీమ్‌ల కింద వందల కోట్లు మంజూరు
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

7



కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా...
- ఎర్రబెల్లి దయాకర్‌రావు స్క్రిప్ట్ మేరకే పర్యటన
- మీడియా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

7



దుకాణదారుడిపై కత్తితో దాడి

గణపురం, ఏప్రిల్ 1: తంబాకు ప్యాకెట్ ఇవ్వలేదనే కోపంతో దుకాణదారుడిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపర్చాడు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బంగ్లాపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాపల్లికి చెందిన నగావత్ రాజు కిరాణ షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన గుగులోతు దేవేందర్ షాపు వద్దకు వచ్చి తంబాకు (అంబర్) ప్యాకెట్ ఇవ్వమని అడిగాడు. అవి లేవని చెప్పడంతో కోపోద్రిక్తుడైన దేవేందర్ తన వెంట తెచ్చుకున్న కత్తితో రాజుపై దాడి చేశాడు. గొంతు భాగంలో పొడవడంతో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని 108 ద్వారా హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి నిందితుడు దేవేందర్‌ను రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం


కాలిన ఇంటి వద్ద సరోజన

కాటారం, ఏప్రిల్ 1: రెక్కాడితే గాని డొక్కా డని గిరిజన మహిళ కుటుంబం రోడ్డున పడింది. అగ్ని ప్రమాదం తో ఇల్లు కాలిపోయి స ర్వం కోల్పోయింది. దేవు డి పటం వద్ద ముట్టిం చిన దీపం ఎలుకలు పడేయడంతో నిప్పంటు కొని ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన మండ లంలోని కొత్తపల్లి తండా లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధిత మహిళ తెలిపిన వివ రాల ప్రకారం.. తేజావత్ సరోజన భర్త సమ్మయ్య కొంత కాలం క్రితం మృతి చెందాడు. పెద్ద కుమారుడు అశోక్‌కు వివాహం కాగా వేరుకాపురం పెట్టాడు. చిన్న కొడుకు శివతో కలిసి కూలినాలి చేసుకుంటూ జీవిస్తోంది. కొంత భూమి ని కౌలుకు తీసుకున్న శివ వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం సరోజన దేవుడి పటం వద్ద దీపం ముట్టించి ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఇంట్లో ఎలుక దీపాన్ని కింద పడేయడంతో నిప్పంటుకొని ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కొద్ది సేపటి తర్వాత తిరిగి వస్తున్న సరోజన ఇంట్లోంచి పొగలు రావడాన్ని చూసి కేకలు వేయడంతో పలువురు వచ్చి మంటలను ఆర్పేశారు. ఇటీవల పత్తి విక్రయించగా వచ్చిన నగదుతోపాటు స్వశక్తి సంఘం డబ్బులు రూ.65వేలు బీరువాలో ఉండగా కాలిబూడిదయ్యాయి. ఇంట్లోని మంచాలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. సుమారు రూ.2.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. నిరుపేద గిరిజన మహిళనైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది.

కావ్యకే టికెట్

- వరంగల్ అభ్యర్థిత్వంపై ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- బీఆర్ఎస్‌ను తిరస్కరించి పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే ఖరారు
- పోటీపడ్డ కాంగ్రెస్ నేతలకు చుక్కెదురు.. పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ



హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నెలరోజులుగా ఉత్కంఠ రేపిన వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే అంశానికి తెర పడింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సోమవారం రాత్రి వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను అధికారికంగా ప్రకటించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య రాజకీయ అరంగ్రేటంతోనే ఊహించని రీతిలో లోక్‌సభ బరిలో నిలిచారు. కడియం వర్గంలో ఈ పరిణామం ఆనందం నింపగా, కాంగ్రెస్‌లోని ఆశావహులను నిరాశకు గురి చేసింది. పార్టీ అధిష్ఠాన నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే..

రెండు రోజుల కిందటే కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తీసుకొని ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ కండువాలను కప్పుకున్నారు. వరంగల్ లోక్‌సభ టికెట్ డిమాండ్‌తోనే శ్రీహరి, కావ్యలు పార్టీలో చేరారు. అయితే ఒక దశలో శ్రీహరి ఎమ్మెల్యే పదవిని వదులుకొని ఎంపీగా రంగంలో దిగుతారనే ప్రచారం జరిగింది. కానీ కూతురు కావ్యను ఎంపీగా బరిలో దింపే డిమాండ్‌తోనే శ్రీహరి కాంగ్రెస్ పెద్దలను ఆశ్రయించారు. మొత్తంగా శ్రీహరి వ్యూహం ఫలించి కావ్యకు టికెట్ దక్కింది. మొత్తంగా వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఎపిసోడ్‌కు తెరపడడంతో ఇక తరువాత పరిణామాలు ఎలా ఉంటాయనే అంశం చర్చనీయాంగా మారింది.

అనూహ్యంగా టికెట్ సొంతం

కొన్ని రోజుల కిందట బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కావ్యను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటిం చింది. దీంతో కావ్య పోటీకి రంగం సిద్ధమైంది. ఇక ప్రచారమే తరువాయి అనుకుంటున్న సమయంలోనే కడియం కావ్య బీఆర్ఎస్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చారు. కవిత అరెస్టు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను ఉటంకిస్తూ బీఆర్ఎస్ నుంచి పోటీ చేయలేనంటూ స్పష్టం చేయడంతో బీఆర్ఎస్‌కు పెను దెబ్బ తగిలింది. ఆ వెంటనే కడియం శ్రీహరి కూడా బీఆర్ఎస్‌కు బైబై చెప్పడం.. తండ్రి, కూతురు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సంకేతాలు ఇవ్వడంతో ఊహించని రాజకీయ పరిణామాలు తెరపైకి వచ్చాయి.

ఎమ్మెల్యేలను కలుస్తున్న తరుణంలోనే..

కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరిన తరువాత సోమవారం వరంగల్‌లోనే ఉదయం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలను కలు స్తూవచ్చారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును వారి వారి క్యాంపుకార్యాలయాల్లో

మిగతా 8వ పేజీలో...

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి ఏప్రిల్ 1: ప్రజా సమస్యలపై ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి వినతులను ప్రాధాన్య క్రమంలో తక్షణమే పరిష్కరించాలన్నారు. దరఖాస్తుదారులకు తమ సమస్య పరిష్కారానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం అందించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 32 వినతులు వచ్చాయి. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 1: పోలీసులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిరర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో ఆయన వివిధ మండలాల నుంచి వచ్చిన 13 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటిపై సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ బాధితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

ములుగు, ఏప్రిల్ 1: మోటార్ సైకిళ్లను దొంగిలించి కేసులో ముగ్గురు వ్యక్తులను ములుగు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్సై ఎ.వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని డీఎల్ఆర్ గార్డెన్ వద్ద జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మోటార్ సైకిల్‌పై వచ్చి అనుమానాస్పదంగా కనిపించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం మామిడిగూడానికి చెందిన తోకల దీక్షిత్‌ను విచారించారు. తాను ఐదు మోటార్‌సైకిళ్లను దొంగిలించి విక్రయించేందుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతడు ఇచ్చిన సమాచారంతో చోరీలకు సహకరించి దొంగిలించిన బైక్‌లను అమ్మేందుకు ప్రయత్నించిన చర్ల మండలం దేవరపల్లికి చెందిన కారం కృష్ణమూర్తి, చింతల వంశీలను అదుపులోకి తీసుకొని మొత్తం ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనపరుకున్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. వాహనాల రికవరీకి ములుగు సీఐ రంజిత్‌కుమార్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, సిబ్బంది సహకారం అందించారని చెప్పారు.

ఎంపీ అభ్యర్థి ఎంపికపై సమాలోచనలు

ఎర్రబెల్లి నివాసంలో నేతలతో హరీష్‌రావు భేటీ

రాంనగర్, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై మాజీ మంత్రి హరీష్‌రావు వరంగల్ నేతలతో సమాలోచనలు చేశారు. సోమవారం నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న హరీష్‌రావు హనుమకొండలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో వరంగల్ లోక్‌సభ పరిధిలోని నేతలతో భేటీ అయ్యారు. బీఆర్ఎస్ నుంచి బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలని నిర్ణయించి జిల్లా నేతలతో చర్చించారు. వరంగల్ అభ్యర్థిత్వం కోసం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్నతోపాటు పార్టీని వీడిన డాక్టర్ రాజయ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రాజయ్యతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకునేది ఖరారు కాలేదు.

కాగా, పెద్ది స్వప్నవైపు పలువురు నేతలు మొగ్గు చూపినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మంచి పేరు ఉండటంతో స్వప్నకు టికెట్ ఇస్తే కలిసివచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. స్వప్న ఎస్సీ సామాజికవర్గం మద్దతుతో పాటు భర్త పెద్ది సామాజికవర్గమైన ఓసీల మద్దతు లభించే అవకాశం ఉంటుందనే విషయాన్ని నేతలు హరీష్‌రావు దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డి సైతం తన సతీమణికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, వీరేందర్, నిరంజన్, సిరిమల్ల సదానందం, విక్టర్‌బాబు, బండి రజనీకుమార్, చింతల యాదగిరి సైతం తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వీరు మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులతో ప్రత్యేక భేటీ అయిన హరీష్‌రావు.. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించేలా చూస్తామని ఆయన తెలిపారు. సుదీర్ఘంగా చర్చించిన హరీష్‌రావు.. అధిష్ఠానంతో మాట్లాడి ఒకటిరెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేద్దామని నేతలకు తెలిపినట్లు సమాచారం.

నలుగురు భూ కబ్జాదారుల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 1: నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. సోమవారం వారిని అరెస్టు చేశారు. ఎస్ఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పారుపాటి శ్రీదేవితోపాటు మరో ఆరుగురు వ్యక్తులు 15 యేళ్ల కిందట కోమటిపల్లి శివారులో స్థలం కొనుగోలుచేసి పర్మిషన్‌లు తీసుకుని షెడ్లు వేసుకుని కబ్జాలో ఉంటున్నారు. కిందటేడు శివప్రసాద్ అనే వ్యక్తి ఈ స్థలం కబ్జా చేసేందుకు యత్నించగా కేసు పెట్టారు. శివప్రసాద్ నుంచి స్థలం తీసుకున్నట్లు పేపర్లు సృష్టించిన హైదరాబాద్‌కు చెందిన ఘట్టమనేని సతీష్‌చంద్రతోపాటు వరంగల్ నగరానికి చెందిన కర్నే వేణు, గూగుల్ నరేష్, కారం ప్రభాకర్‌లు కబ్జా చేసే ప్రయత్నం చేశారు. 15 యేళ్ల కిందట కొనుగోలు చేసిన వారిని బెదిరింపులకు గురిచేసి వారు నిర్మించుకున్న షెడ్లను నేలమట్టం చేసి స్థలం చదును చేశారు. ఈ స్థలం వేరే వ్యక్తులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నకిలీపత్రాలు సృష్టించి కబ్జాకు యత్నించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కాగా, ఈ నలుగురు భూకబ్జాదారులుగా గుర్తించి రౌడీషీట్లు ఓపెన్ చేశారు.

నేడు మందబుద్ధిపై అవగాహన సదస్సు

వడ్డెపల్లి, ఏప్రిల్ 1: హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ప్రపంచ మందబుద్ధి (ఆటిజం)పై అవగాహన సదస్సును మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొనాలని ఆమె కోరారు.

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఆశీర్వదించండి

ఎంపీగా గెలిపిస్తే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి : ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి బాబుమోహన్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రజాశాంతి పార్టీ నుంచి బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు ఆశీర్వదించి విజయం కట్టబెట్టాలని ప్రజాశాంతి పార్టీ లోక్‌సభ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి బాబుమోహన్ కోరారు. సోమవారం హనుమకొండ ములుగురోడ్‌లోని ఓహోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాబుమోహన్ పాల్గొని మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ఆశీస్సులతో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ నుంచి వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటానన్నారు. ప్రజాశాంతి పార్టీ తరఫున కేఏ పాల్ విశాఖపట్నం లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నాడని, అక్కడికి తనను పిలిపించి శాలువా కప్పి ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా, వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారన్నారు. వరంగల్ బిడ్డగా, 25 యేళ్ల రాజకీయ అనుభం కలిగిన తనను వరంగల్ ప్రజలు లోక్‌సభకు ఆశీర్వదించి పంపితే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి చేస్తానన్నారు.


హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న బాబుమోహన్

లోక్‌సభ అభ్యర్థిగా విజయం కట్టబెడితే ప్రజాశాంతి పార్టీ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యంతోపాటు వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లను కేఏ పాల్ సొంత నిధులతో అందిస్తామని బాబుమోహన్ హామీ ఇచ్చారు. ప్రపంచ దేశాల అధ్యక్షుల మన్ననలు పొందిన వ్యక్తిగా, సేవాగుణం కలిగిన వ్యక్తిగా, రాష్ట్రానికి పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు తీసుకవచ్చిన గొప్ప మేధావి అయిన కేఏ పాల్ పట్ల కొందరు వక్తలు తప్పుడు కూతలు కూయడం సరికాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లాగా అబద్ధాలు చెప్పడంగానీ, మోసాలకు పాల్పడటం తెలియని వ్యక్తి కేఏ పాల్ అని కొనియాడారు. కేసీఆర్‌తో తాను టచ్‌లో ఉన్నానని కొందరు పుట్టిస్తున్న పుకార్లు అవాస్తవమని, తాను ఎవరికో కొమ్ముకాస్తున్నానని వస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. తనను కొనే మొనగాడు ఈ భూమి మీద ఇంకా పుట్టలేదన్నారు. చౌకబారు రాజకీయలు చేయకుండా నిజాయితీతో కూడిన రాజకీయలు చేయాలని హితవు పలికారు.

25 యేళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ కాంట్రాక్టులు, అవినీతి, అక్రమాలకు, కబ్జాలు పాల్పడలేదన్నారు. మాజీ సీఎం ఎన్‌టీఆర్ ఆశీస్సులతో రాజకీయ అరంగ్రేటం చేశానన్నారు. వరంగల్ గడ్డపై పుట్టి ఖమ్మంలో పెరిగి సినిమా ఇండస్ట్రీలో అంచెలంచెలుగా ఎదిగి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చానన్నారు. గతంలో ముక్కు, మొఖం తెలియని జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా అక్కడి ప్రజలకు విశేష సేవలు, అభివృద్ధి పనుల చేసిన తాను.. జన్మనిచ్చిన జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. లోక్‌సభ బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు పెద్ద మనస్సుతో దీవించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సింగారపు సుజాత , పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తరాల శంకర్, ఆర్ల శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ వార్షిక ఆదాయం

రాంనగర్, ఏప్రిల్ 1: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల ద్వారా కిందటేడు కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. కిందటేడు (2022-23) ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి 103646 డాక్యుమెంట్స్ కాగా ఫీజు రూపేనా రూ.404కోట్ల 42లక్షల 93వేల ఆదాయం రాగా, ఈవార్షిక సంవత్సరం (2023-24) 106016 డాక్యుమెంట్లు కాగా ఫీజు రూపేనా రూ.415కోట్ల 63 లక్షల 61వేలు ఆదాయం సమకూరింది. గత సంవత్సరం కంటే రూ.11కోట్ల 20లక్షల 68వేలు ఆదనంగా ఆదాయం వచ్చింది. ఈ యేడు 13 కార్యాలయాల్లో హనుమకొండ వడ్డెపల్లి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అత్యధికంగా 29557 డాక్యుమెంట్‌లు నమోదు కాగా రూ.201కోట్ల 22లక్షల 18వేల ఆదాయం రావడం విశేషం. ఈ యేడు వచ్చిన ఆదాయంలో సగం జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రావడం గమనార్హం.

ఒడిస్సా కూలీ మృతి

బయ్యారం, ఏప్రిల్ 1:జీవనోపాధి నిమిత్తం ఒడిస్సా రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ కూలీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బయ్యారం మండలం కాచనపల్లి ఇటుక బట్టీలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం నవరంగ్ జిల్లా కందిగూడ గ్రామానికి చెందిన బోయి సంపత్ (56) నెల కిందట ఇటుక బట్టీలో దినసరి కూలీగా పనిచేసేందుకు కొందరు కూలీలతో బయ్యారం మండలం వచ్చాడు. కాచనపల్లి సమీప ఓ ఇటుక బట్టీ నందు పనిలో చేరిన సంపత్.. తోటి కూలీలతో కలిసి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సంపత్ బట్టీలో ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించాడు. తెల్లవారుజామున తోటి కూలీలు చూసే సరికి సంపత్ మృతి చెంది ఉన్నాడు. సంపత్ ఎలా మృతి చెందాడనదే ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. కానీ బట్టీ యజమాని మాత్రం సంపత్‌ది సహజ మరణమేనని పేర్కొంటున్నాడు. సంపత్ కొంత మద్యం సేవించి నిద్రించినట్లు బట్టీ యజమాని వెల్లడించారు. అటవీ ప్రాంతంలో గల బట్టీలో నిద్రించడంతో ఏదైన విష పురుగు కుట్టి చనిపోయాడా.. లేక మద్యం సేవించిన మత్తులో నిద్రించి దాహార్తికి లోనై మృతి చెంది ఉంటాడా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

యువకుడిపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

కొత్తగూడ, ఏప్రిల్ 1 : కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో యువకుడిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. కొత్తగూడ మండలం చిట్యాలగడ్డకు చెందిన వంకాయల కార్తీక్ అనే యువకుడిని ఈ నెల 19న పొగుళ్లపల్లిలో తొమ్మిది మంది కలిసి విచక్షణ రహితంగా దాడి చేశారు. కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిదిమందిపై అపహరణ, గాయపరిచిన, కు లం పేరుతో దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మహ బూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు సోమవారం పొగుళ్లపల్లికి చేరుకుని విచారణ చేప ట్టారు. అనంతరం కేసు నమోదైన గద్ద అశోక్, ఎటుకూరి హరీష్, చవ్వ శివ, వట్టం నాగరాజు, గుగ్గిళ్ల నర్సయ్య, బైరబోయిన అశోక్, గాజుల వెంకటేశ్వర్లులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్ద పీట

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 1: వరంగల్ అభివృద్ధికి వందల కోట్ల నిధులు కేటాయించి దేశంలోనే వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్దపీట వేశాడని బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ లోక్‌సభ సీటు గెలుపు కోసం ఏవిధంగా సిద్ధం కావాలనే అంశంపై పశ్చిమ నియోజకవర్గంలోని బూత్‌స్థాయి నాయకులతో సోమవారం హంటర్‌రోడ్డులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ మాట్లాడుతూ.. 2014 కంటే ముందు తెలంగాణలో 2,511 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉంటే.. మోదీ 9 ఏళ్ల పాలనలోనే 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించారని గుర్తు చేశారు. మరో 2,269 కిలోమీటర్ల జాతీయ రహదారులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. స్మార్ట్‌సిటీ ద్వారా వరంగల్ నగరంలో మెరుగైన సదుపాయాల కోసం రూ.2,500 కోట్ల నిధులు మోదీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హెరిటేజ్ సిటీ కింద రూ.32కోట్లను విడుదల చేశారన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన స్కీమ్‌లో భాగంగా వరంగల్‌కు 7,096 ఇళ్లను మంజూరు చేశారన్నారు. అమృత్ పథకం కింద 273.58కోట్ల నిధులను ఇచ్చారన్నారు. ఆదర్శ రైల్వేస్టేషన్స్‌లో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్ ఆధునీకరించడం, కాజీపేట నుంచి విజయవాడకు మూడో లైన్ పనులను చకాచకా జరుగుతున్నాయన్నారు. రూ.521కోట్లతో నిర్మించబోతున్న రైల్వే తయారీ యూనిట్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభించబోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కిరోసిన్‌తో దీపాలు వెలిగించుకొని జీవితాలు వెళ్లదీసేదని, అలాంటిది మోదీ ప్రభుత్వంలో ప్రధానమంత్రి సౌభాగ్య యోజన స్కీమ్‌లో భాగంగా తెలంగాణలో ఐదు లక్షల 15వేల విద్యుత్ కనెక్షన్‌లను ఇచ్చారని అరూరి అన్నారు. కాకతీయులు నిర్మించిన వారసత్వ సంపదకు యునెస్కో గుర్తింపు రావడానికి మోదీ కృషి మరువలేనిదన్నారు. అన్నీ విధాలుగా వరంగల్‌ను అక్కున చేర్చుకున్న మోదీ నాయకత్వాన్ని వరంగల్ బలపర్చాలని కోరారు.


పశ్చిమ నియోజకవర్గ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 1984లో వరంగల్ వచ్చిన ఫలితాలే మళ్లీ పునరావృతం అవుతాయన్నారు.

ఈ సమావేశంలో హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, పార్టీ క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ ధర్మారావు, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఆర్.కిషన్, సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, డి.దేవేందర్ రెడ్డి, కార్పొరేటర్లు ఆర్.కోమల, బి.లక్ష్మీ, సీహెచ్. స్వాతి, డి.అభినవ్ భాస్కర్, జి.వసంత, జిల్లా నాయకుడు కొలను సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొండా దంపతులను వారి నివాసంలో కలిసిన కడియం శ్రీహరి, కావ్య

బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరా..

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మతోన్మాద బీజేపీ ఆగడాలను అడ్డుకునేందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. దేశవ్యాప్తంగా మైనారిటీలు, దళితులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పోరాడుతోందన్నారు. లౌకికవాద పరిరక్షణ కోసం పార్టీలో చేరానన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నాగరాజును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం కూతురు కావ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి పాలన ప్రజాదరణ పొందుతోందన్నారు. స్వేచ్ఛ కోసం కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో కూడా కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. మిగతా వివరాలు త్వరలో వివరంగా తెలియచేస్తానని మీడియా ప్రశ్నలకు బదులిచ్చారు. కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన తదుపరి ఎమ్మెల్యేలను కలవాలనే ఉద్దేశంతో వచ్చినట్లు చెప్పారు. ప్రత్యక్ష ఎన్నికల్లో మాట్లాడే అవకాశం తనకు ఇంకా రాలేదని, వచ్చాక చెబుతానంటూ మీడియా ప్రశ్నలకు కావ్య సమాధానంగా చెప్పారు. కాగా, అంతకుముందు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కావ్య కలిశారు. సోమవారం ఇద్దరు ఎమ్మెల్యేలను వారి వారి నివాసాల్లో వేరు వేరుగా కలిశారు.

కొండా దంపతులను కలిసిన కడియం శ్రీహరి, కావ్య

వరంగల్ సిటీ: కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుల నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అలాగే, పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానాన్ని గెలిపించుకునేందుకు వ్యూహాలపై చర్చించుకున్నారు. తొలిసారి కడియం శ్రీహరి, కావ్య తమ నివాసానికి వచ్చినందున కొండా దంపతులు నూతన వస్త్రాలతో సత్కరించారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి సురేఖ

వరంగల్ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం తొలిసారిగా వేములవాడ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తన మనవడి పేరుమీద కోడె మొక్కును చెల్లించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని స్వామిని ప్రార్థించినట్లు మంత్రి చెప్పారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో పూజలుచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.


మంత్రి కొండా సురేఖకు స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా..

● దయాకర్‌రావు స్క్రిప్ట్ మేరకే పర్యటన ● మీడియా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. డ్రామాకు సంబంధించిన స్క్రిప్ట్ అంతా మాజీ మంత్రి దయాకర్‌రావు సిద్ధం చేసి కేసీఆర్‌తో మాట్లాడించారని ఆరోపించారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో నాగరాజు కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కుంభకర్ణుడు నిద్రలేచినట్లు కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి రైతుల వద్దకు వచ్చారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులను పట్టించుకోని కేసీఆర్‌కు ఇప్పుడు రైతులు గుర్తుకు రావడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్‌పాలన ఇంకా నాలుగు నెలలు కూడా పూర్తి కాక ముందే కేసీఆర్ అభాండాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. వర్షాకాలం రాక ముందే సీఎం రేవంత్ రెడ్డి పాలనలో కరువు వచ్చిందంటూ వ్యాఖ్యలు చేయడం కేసీఆర్‌కు మతిభ్రమించినట్లు అర్థమవుతోందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెబుతున్న కేసీఆర్.. వాస్తవాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తరిమికొడతామని హెచ్చరించారు. రైతుల బతుకులను ఛిద్రం చేసింది కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు దిక్కుతోచని స్థితికి గురయ్యారన్నారు. ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని మండిపడ్డారు. రైతుబంధును బూచిగా చూపి రైతులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను హరించారని ఆరోపించారు. రైతుబంధు పేరుతో కేసీఆర్ దోపిడీ చేశారన్నారు. ఈ క్రమంలో అర్హత గల రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి భూస్వాములకు రైతుబంధు వర్తించకుండా పరిమితులు విధించి అమలు చేయాలనే ప్రణాళికతో ఉన్నారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్‌పాలనలో విద్యుత్, నీటిసరఫరా నిరంతరాయంగా జరుగుతుందన్నారు.

కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలన స్కామ్‌లమయంగా సాగిందని నాగరాజు ఆరోపించారు. కాళేశ్వరం భారీ కుంభకోణమన్నారు. దేశచరిత్రలోనే ఇంతటి కుంభకోణం మరొకటి లేదన్నారు. కేవలం దోచుకోవడానికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ స్కెచ్ వేశారన్నారు. నిపుణులు డిజైన్ విషయంలో ఎంతగావారించినా 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్ వినలేదని విమర్శించారు. మిషన్‌కాకతీయ పేరిట చెరువుల పూడికతీత చేపట్టిన కేసీఆర్.. వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో చూపించాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు ఇలా.. ప్రతీదానిలో కేసీఆర్ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. కూతురు కవిత లిక్కర్ స్కాం, కేసీఆర్ కాళేశ్వరం కుంభకోణం, కుమారుడు మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. ఇలా కేసీఆర్ కుటుంబం అక్రమాలు తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశాయన్నారు. అక్రమాలు బయటపడుతుండడంతో కేసీఆర్ మతిభ్రమించి కరువు యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని నాగరాజు పేర్కొన్నారు. గడీల తలుపులు బద్దలు కొట్టి ప్రజాపాలనకు ద్వారాలు తెరిచారన్నారు. కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్యల చేరికపై మీడియా ప్రశ్నలకు సమాధానమిస్తూ.. అధిష్ఠానం అన్ని కోణాల్లో ఆలోచించే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కిసాన్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శేఖర్‌రావు, కిసాన్ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావుతోపాటు మహేందర్, వీసం సురేందర్‌రెడ్డి, తిరుపతి, బుచ్చిరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంపల్లిలో భూ వివాదంలో ఘర్షణ

● భార్యాభర్తలు, కొడుకుపై హత్యాయత్నం ● గొడ్డలి, కర్రలతో దాడి.. తీవ్రగాయాలు

సీరోలు, ఏప్రిల్ 1: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో సోమవారం రెండు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదం ఘర్షణకు దారితీసింది. ఇందులో దంపతులు, వారి కుమారిడిపై ప్రత్యర్థులు కర్రలు, గొడ్డల్లతో దాడిచేయడంతో వారు తీవ్రంగా గాయపడి జిల్లా ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. బాధితుల కథనం ప్రకారం...కాంపల్లి గ్రామంలో రేపాల కృష్ణ, రేపాల వెంకటనారాయణ కుటుంబాల మధ్య గత కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. గ్రామ సమీపంలోని మహబూబాబాద్-ఖమ్మం ప్రధాన రహదారి పక్కన ఉన్న రేపాల కృష్ణ వ్యవసాయ భూమిలో అదే గ్రామానికి చెందిన రేపాల వెంకటనారాయణ, వెంకన్న ఉపేందర్, పెద్ద సత్యంలు కృష్ణ భూమిలో రాళ్లు పాతేందుకు యత్నిస్తుండగా తమ భూమిలో రాళ్లు ఎందుకు పాతుతున్నారని వారిని అడుగగా ఘర్షణ చోటుచేసుకుంది. ఇది నీ భూమి కాదు మా భూమిలో రాళ్లు పాతుకుంటే నీవెవరు అడ్డుకోవడానికి అంటూ కృష్ణతో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో వారి వెంట తెచ్చుకున్న గొడ్డల్లు, కర్రలు, గడ్డపారలతో కృష్ణ కుమారుడు అశోక్‌పై దాడి చేస్తుం డగా అడ్డువచ్చిన తల్లి బిక్షమమ్మపై కూడా దాడి చేశారు. . తల్లిని కాపాడేందుకు ప్రయత్నించిన అశోక్‌పై దాడిచేస్తుండగా పక్కనే వరి పొలం కోయిస్తున్న తండ్రి రేపాల కృష్ణ అక్కడికి చేరుకోగానే ముగ్గురిపై ప్రత్యర్థులు దాడి చేశారు. గొడ్డలితో తలపై నరకడంతో తీవ్రగాయమై రక్తస్రావంతో కుప్పకూలిపోవడంతో చుట్టుపక్కల వారు వెంటనే. 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో ఆ ముగ్గురిని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కృష్ణ పరిస్థితి విషమంగా ఉందని భార్య బిక్షమమ్మ కుమారుడు అశోక్, తెలిపారు. ఈ విషయంపై సీరోలు ఎస్సై విజయ్ రాంకుమార్‌ను వివరణ కోరగా బాధతుడి కూతురు యశోద ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఘర్షణలో గాయపడిన రేపాల కృష్ణ, రేపాల అశోక్

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

ములుగు జిల్లాలో మొదటి విడతగా 22 కేంద్రాలను ప్రారంభించాం • కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఏటూరునాగారం, ఏప్రిల్ 1 : ములుగు జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చేపడతామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం యాసంగి ధాన్యం కొనుగోలుపై ఏటూరునాగారంలోని రైతు వేదికలో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ములుగు జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఏప్రిల్ 1 నుంచి ములుగు మండలంలో మూడు కేంద్రాలు, వెంకటాపూర్(రామప్ప) మండలంలో మూడు, గోవిందరావుపేట మండలంలో మూడు, తాడ్వాయి మండలంలో మూడు, ఏటూరునాగారం మండలంలో మూడు, మంగపేట మండలంలో రెండు, కన్నాయిగూడెం మండలంలో ఒకటి, వాజేడు మండలంలో ఒకటి, వెంకటాపురం (నూగూరు) మండలంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు ఈనెల రెండో వారంలో 73 కేంద్రాలు, మూడో వారంలో 49 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరపై ధాన్యాన్ని రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేడ్- ఏ రకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 2,203, సాధారణ రకం ధాన్యానికి రూ. 2,183 మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలలో పండించిన ధాన్యం మన జిల్లాలోకి తీసుకురాకుండా వాజేడు మండలం పేరూరు గ్రామం వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ఏర్పాటు చేశామన్నారు. మూడు షిఫ్టులతో అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ రాంపతి, డీఏవో విజయ చంద్ర, డీసీవో సర్దార్ సింగ్, ఏటూరునాగారం గిరిజన సహకార సంస్థ సొసైటీ మేనేజర్ జె. దేవ్, తహసీల్దార్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

• మంగపేట: మండలంలోని కమలాపురంలో డీఆర్డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో మజీద్ ఏరియాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డీఆర్డీఏ డీపీఎం గోవింద్ చౌహాన్ సోమవారం ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అప్పారావు, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు రమాదేవి, సీసీలు తారా, శ్రీను, వీవోఏ ఉమాదేవి, బుక్ కీపర్ సమ్మారావు, కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలైన శ్రీ ఆంజనేయ గ్రామైక్య సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

• వెంకటాపురం(నూగూరు): ప్రభుత్వం ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ కార్యదర్శి ఆర్వీ.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్యామ్, సొసైటీ సిబ్బంది సుధ, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడలో సెంట్రల్ లైటింగ్

కాటారం, ఏప్రిల్ 1: మండలంలోని ధన్వాడ గ్రామ పంచాయతీ పరిధిలో కాటారం-మంథని రహదారిలో ఉన్న డివైడర్‌పై, రోడ్డు పక్కన హైమాస్ట్ లైట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. ప్రస్తుత ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని జెన్కో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.20 లక్షలు మంజూరు చేయించారు. దీంతో డివైడర్‌పై రెండు, రహదారి పక్కన గల పోచమ్మగుడి, విద్యుత్ సబ్‌స్టేషన్, కిష్టంపేట వద్ద లైట్లను ఏర్పాటు చేయడానికి నిర్మాణాలు చేశారు. దీంతో గతంలో డివైడర్‌పైకి పలు వాహనాలు దూసుకెళ్లగా ప్రస్తుతం సెంట్రల్ లైటింగ్ సిస్టంతో ప్రమాదాలు తప్పుతాయని పలువురు భావిస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

మంగపేట, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్‌లో జ్వాల చారిటబుల్ ట్రస్ట్, పోలీసుశాఖ సంయుక్తంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబా సాహెబ్, ఏటూరునాగారం సీఐ మండల రాజు యాదవ్, స్థానిక ఎస్సై గోదావరి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జ్వాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడేల నరేష్, యూత్ సభ్యులు, ఆటో యూనియన్ నాయకులు, పోలీస్‌లు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 1: మండల కేంద్రం నుంచి వాజేడు మండలం ఏడ్జర్లపల్లి గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో బెస్తగూడెం క్రాస్ వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసిన సంఘటన కలకలం రేపుతోంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బెస్తగూడెం గ్రామానికి వెళ్లే దారి నాలుగురోడ్ల కూడలిగా ఉంది. దీంతో ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వ్యక్తులు పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, నిమ్మకాయలతో క్షుద్రపూజలు చేసి ఉంటారని, దీంతో గ్రామస్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

బిజినేపల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

వాజేడు, ఏప్రిల్ 1: మండల పరిధిలోని బిజినేపల్లిలో సోమవారం వాజేడు పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు నేతృత్వంలోని సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలు ఉదయం పూట గ్రామంలోకి ప్రవేశించి ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామంలోకి కొత్తగా వ్యక్తుల వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అడవి జంతువుల వేట కోసం విద్యుత్ సరఫరా కలిగిన ఉచ్చులను అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా యువత కోడి పందెలు, పేకాట అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, గుడుంబా ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిషేధిత విప్లవ సంఘాలు, పార్టీలకు సహకరించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జనార్దన్



ఏటూరునాగారం, ఏప్రిల్ 1: బీజేపీ అనుబంధ దళిత మోర్చా ములుగు జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వావిలాల జనార్దన్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నీటి సరఫరాను పర్యవేక్షించాలి : ఎంపీడీవో

కాటారం, ఏప్రిల్ 1: మండలంలోని 24 జీపీల పరిధి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీడీవో అడ్డూరి బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీవో ఉపేంద్రయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్‌తో కలిసి ఎంపీడీవో బాబు కార్యాచరణ ప్రణాళికపై కార్యదర్శులతో సమీక్షించారు. ఆయా జీపీల పరిధిలో ఉన్న స్కీం పాయింట్లు ఎన్ని.. వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి.. రిపేర్ కోసం ఎన్ని ఉన్నాయి.. చేతిపంపుల పరిస్థితి, ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకులెన్ని, వాటిలో మిషన్ భగీరథ, డైరెక్ట్ పంపింగ్ ద్వారా ఎంత నీరు సరఫరా అవుతున్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యలను త్వరితగతిన అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మేడిపల్లి వద్ద ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు ఏర్పాటు

కాటారం, ఏప్రిల్ 1: మండలంలోని 353(సీ)జాతీయరహదారిపై మేడిపల్లి టోల్‌గేట్ వద్ద ఎస్ఎస్‌టీ(స్టాటిక్ సర్వైలెన్స్ టీం)చెక్ పోస్టు ఏర్పాటైంది. కాటారం సీఐ నాగార్జునరావు సోమవారం సందర్శించి ఎస్ఎస్‌టీ సభ్యులతో పలు అంశాలపై చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ నిబంధనల మేరకు నగదు, ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సామగ్రి తరలింపుపై అప్రమత్తంగా ఉంటూ వాహనాల తనిఖీలు క్షుణ్ణంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట కాటారం ఎస్సై అభినవ్ ఉన్నారు.

మాదిగలను మోసం చేసిన మాజీ ఎంపీ

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రాజు మాదిగ

మంగపేట, ఏప్రిల్, 1: బిల్ట్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని మాదిగలను ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు మోసం చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గాజర్ల రాజు మాదిగ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కమలాపురంలో 1978లో ఏపీ రేయాన్స్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగిందని, ఆ సమయంలో స్థానిక మాదిగలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశం కల్పించలేదని తెలిపారు. నిజాం పరిపాలనలో వెట్టిచాకిరీ కింద మాదిగలకు ఇనాం కింద ఇచ్చిన ఆరెకరాల భూమిలో బిల్ట్ ఫ్యాక్టరీ అవసరం కోసం వాడుకొనేందుకు 2006లో కౌలుకు తీసుకొని ఎలాంటి ఆధారువు చూపలేదని పేర్కొన్నారు. మాదిగల భూములను చెరువులు చేసి లబ్ధిపొందిన పారిశ్రామికవేత్త మోసం చేశారని ఆరోపించారు. ఇందుకు ఆయనకు పలువురు గ్రామ ప్రముఖులు సహకరించారని విమర్శించారు. ఇప్పటికైనా మాదిగలకు న్యాయం చేయాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మేనిఫెస్టో చైర్మన్‌గా శ్రీధర్‌బాబు ఎంపికపై హర్షం

మల్హర్, ఏప్రిల్ 1 : కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఎంపిక పట్ల ఆ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగి , పేదలకు ఎప్పుడు అండగా ఉండే శ్రీధర్‌బాబుకు మేనిఫెస్టో కమిటీ చైర్మన్ బాధ్యతలను అప్పగించడం శుభసూచికమని పేర్కొన్నారు.

కొలువుదీరిన 'బార్' కమిటీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 1: జయశంకర్ భూపాల పల్లి జిల్లా బార్ అసోసియేషన్ నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసిం ది. అధ్యక్షుడిగా కునూరు సురేష్ కుమార్, సెక్రటరీగా బల్ల మహేంద ర్‌తో పాటు కమిటీ సభ్యులు బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు న్యాయ వాదులు శుభాకాం క్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న బార్ అసోసియేషన్ కమిటీ

ప్రశాంతంగా ముగిసిన ఒకేషనల్ పరీక్షలు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 1: పదవ తరగతి ఒకేషనల్ వార్షిక పరీక్షలు సోమవారం ముగిశాయని డీఈవో రామ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయగా 442 మంది విద్యార్థులక439 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. కలెక్టర్ భవే ష్‌మిశ్రా, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అన్ని మౌలిక సౌకర్యాల కల్పనతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

'చిన్న కాళేశ్వరం' పనుల ప్రారంభం

బీరసాగర్ పంపులకు మరమ్మతులు షురూ..



బీరసాగర్ పంప్‌హౌస్‌లోని మోటార్లకు కొనసాగుతున్న మరమ్మతులు

మహదేవపూర్, ఏప్రిల్ 1: భూపాలపల్లి జిల్లాలోని మారుమూల మండలాల్లోని 40 వేల ఎకరాలకు సాగునీటిని అందించే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పునఃప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం తొమ్మిదిన్న రేళ్లు పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుత మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపి పలుమార్లు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారం వ్యవధిలో స్వయంగా కలెక్టర్ రెండుసార్లు క్షేత్రస్థా యిలో పర్యటించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ క్రమంలో పనులు ప్రారంభమయ్యాయి.

చిన్నకాళేశ్వరం ప్రాజెక్టును రెండు విడతలుగా విభజించారు. మొదటి విడతలో బీరసాగర్ వద్ద పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి మహదేవపూర్ మండలంలోని మూడు చెరువులకు నీటిని తరలించి అక్కడి నుంచి పంట భూములకు నీటిని అందించాలని నిర్ణయించారు. రెండో విడతలో గారెపల్లి వద్ద చెరువును నిర్మించి, దానిలో నీటిని నింపి అక్కడి నుంచి మరో పంప్‌హౌస్ ద్వారా నీటిని మరికొన్ని చెరువులకు తరలించి వాటి తద్వారా నీటిని పంపిణీ చేయాలని, మూడో విడతలో మూడు చెరువులకు నీటిని ఎత్తిపోయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా బీరసాగర్ వద్ద పంప్‌హౌస్‌లోని మోటార్లను రిపేరు చేయిస్తున్నారు. 2008లోనే పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. 2013లో అందులో మోటార్లు బిగించారు. వాడకంలో లేకపోవడం, గత ఏడాది గోదావరి నదికి భారీ వరదలు రావడంతో మోటార్లు పనిచేయడం లేదు. దీంతో వాటికి మరమ్మతులు మొదలెట్టారు. అప్రోచ్ కెనాల్ పూడికతీత, డీవాటరింగ్ పనులను చేపట్టారు. అవి పూర్తయితే నీటిని మహదేవపూర్ మండలంలోని మూడు చెరువులకు ఎత్తిపోయొచ్చు. మండల కేంద్రంలోని ఎర్రచెరువు, కొత్త చెరువు, మందరం చెరువులకు నీటిని ఎత్తిపోసే ప్రక్రియ మొదలు పొట్టొచ్చు. ఈ మూడు చెరువుల ద్వారా సుమారు 10,470 ఎకరాలకు నీటిని అందించొచ్చు.

మొదలుకాని భూసేకరణ

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంది. దీని కోసం 13 చెరువుల కెపాసిటీ పెంచే పనులు చేపట్టాల్సి ఉంది. చెరువుల్లో నింపిన నీటిని పంట చేలకు చేర్చేందుకు కాల్వల నిర్మాణం చేయాల్సి ఉంది. దీనికోసం సుమారు 1,400 ఎకరాల భూమిని 63 గ్రామాల్లో సేకరించాల్సి ఉంది. అయితే.. ఈ ప్రక్రియన ఇంకా మొదలు కాలేదు.

పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలందించాలి

• ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 1: జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్పీ శబరీశ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రైటర్స్‌తో సమావేశం జరగగా ఆయన మాట్లాడారు. పిటిషన్ల స్వీకరణ, కేసుల నమోదు, పార్ట్-1,2, చార్జ్‌షీట్ నమోదు, కోర్టు డిస్పోజల్ వంటి ఏడు ఇంటిగ్రేటెడ్ ఫార్మ్స్‌పై నైపుణ్యతను పరిశీలించి మెరుగైన విధంగా కేసులు నమోదు చేయాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం అందించేలా పనిచేయాలన్నారు. ఏయే ప్రాంతాల్లో నేరాలు, ప్రమా దాలు జరుగుతున్నాయో పరిశీలించి నేరాలు, ప్రమాదాల శాతాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీసీఆర్‌బీ డీఎస్పీ రాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

కావ్యకే టికెట్

(5వ పేజీ తరువాయి)

కలిశారు. నాగరాజు కార్యా లయంలో మీడియాతో కూడా శ్రీహరి, కావ్య మాట్లాడారు. టికెట్ విషయాన్ని మీడియా ప్రస్తావించినా ఏ మాత్రం కూడా బయట పడకుండా మాట్లాడారు. ఆ తరువాత సాయంత్రం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీని వారి నివాసంలో కలిశారు. ఇలా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కలుస్తున్న తరుణంలోనే కావ్యకు టికెట్ ఖరారైందనే వార్తలు వెలుబడ్డాయి.

పోటీపడ్డ నేతలకు చుక్కెదురు

వరంగల్ లోక్‌సభ టికెట్‌పై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు ఇతరులు కూడా సీరియస్‌గా ప్రయత్నించారు. ఎందరి పేర్లో తెరపైకి వచ్చాయి. ఒక విధంగా స్థానికేతరుడైన అద్దంకి దయాకర్ పేరు కూడా తొలి నుంచి వినిపించింది. ఇక జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, బొడ్డు సునిత, జన్ను పరంజ్యోతి, డాక్టర్ అనిల్, డాక్టరు పెరుమాండ్ల రామక్రిష్ణ.. ఇలా ఎందరో నాయకులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేయగా నిరాశే ఎదురైంది. కడియం కావ్యకు టికెట్ కేటాయింపుపై ఆశావహులతో పాటు కాంగ్రెస్ శ్రేణుల్లో కూడా అసంతృప్తి నెలకొంది.

బయోడేటా

పేరు : కడియం కావ్య
తండ్రి పేరు : కడియం శ్రీహరి
తల్లి పేరు : వినయరాణి
జన్మస్థలం : హనుమకొండ
భర్త పేరు : డాక్టర్ ఎం.డి. నజీరుల్లా షేక్
సంతానం : కూతుర్లు దివ్య, మిహిరా
విద్యార్హతలు : ఎంబీబీఎస్, ఎం.డి. (పాథాలజీ)
వృత్తి: అసిస్టెంట్ ప్రొఫెసర్
(ప్రతిమ రిలీఫ్ మెడికల్ కాలేజీ హనుమకొండ)

అవినీతిపరుల భరతం పడతాం..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 1: కబ్జాకోరులు, అవినీతిపరుల భరతం పడతామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో భూపాలపల్లి నియోజకవర్గంలో పేదల భూములు లాక్కుని, దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకుని కబ్జా చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వారి నుంచి ఆ భూములు తిరిగి పేదలకు దక్కేలా కృషి చేస్తామన్నారు. ఉద్యోగాల పేరిట లక్షలాది రూపాయలు అక్రమంగా వసూలు చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ రెండు వర్గాల భరతం పట్టి తీరుతామన్నారు. భూపాలపల్లికి దక్కకుండా హనుమకొండలో ఏర్పాటు చేసిన మహిళా డిగ్రీ కాలేజీని, ఇతర గురుకులాలను ఇక్కడికి తీసుకొస్తామని అన్నారు. గణపురం మండలం గాంధీనగర్‌లో ఉన్న ప్రభుత్వ భూములను విద్య వ్యాప్తి కోసం కేటాయించి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందడం కోసం సీటీ స్కాన్, ఎంఆర్‌ఐలను ఏర్పాటు చేస్తామన్నారు. 100 పడకల ఆస్పత్రిలో అవసరమైన 203 మంది సిబ్బందిని ఇప్పటికే నియమించామని అన్నారు. స్థానికంగా బ్లడ్ బ్యాంకు ఉండాలని రెడ్‌క్రాస్ వారు చేపట్టిన భవన నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలలో ఇప్పటికే ఐదు పథకాలు అమలులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొంరయ్య, నాయకులు దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్, రాజిరెడ్డి, వెంకటస్వామి, విజయ్, అనిల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 300 మంది కార్మికులు

బొగ్గు లోడింగ్ అన్‌లోడింగ్ (కాంటా) కార్మికులు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో సుమారు 300 మంది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. విజయ్ సారథ్యంలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే గండ్ర ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన వారు ఉన్నారు.

కష్టపడే కార్యకర్తలకు అవకాశాలు

రేగొండ : కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడే కార్యకర్తలకు తప్పకుండా అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే నన్నారు. అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, సీనియర్ నాయకుడు గుంటోజ్ కిష్టయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎడ్ల మల్లారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిట్యాల : మండలంలోని కొత్తపెల్లి, గాంధీనగర్, చిట్యాల, తిర్మలపురం గ్రామాలకు చెందిన కొండేటి మధుకర్, బొట్ల రాజు, కాంగ్రెస్ యూత్ కమిటీ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ తండ్రి సారయ్య గోపగాని సురేందర్, వరలక్ష్మి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కామిడి రత్నాకర్‌రెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, గడ్డం కొమురయ్య, మూల శంకర్, బుర్ర శీనివాస్, లక్ష్మణ్, బొట్ల రవి, నందరాజు, శివ, కిషోర్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల, ఏప్రిల్ 1: మండలంలోని తిర్మలపురం శివారులో అనుమతు ల్లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వాహన తనిఖీలు చేస్తుండగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని యాజమాని దేవా సతీష్, డ్రైవర్ ఉట్ల అనీల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు

గుడుంబా స్వాధీనం

కాటారం (మహదేవపూర్ రూరల్), ఏప్రిల్ 1: పలిమెల మండల కేంద్రంలో సోమవారం తొమ్మిది లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్ల ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. బోయ నడువలి అనే వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా గుడుంబా పట్టుబడిందని, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

దొంగతోనే కండువా కప్పించుకుంటివి..

(5వ పేజీ తరువాయి)

పార్టీని వీడుతున్నా రని మండిపడ్డారు. కడియం కూతురుకు ఎంపీ టికెట్ ఇస్తే మూడో స్థానంలో వస్తుందని తాను కేసీఆర్‌కు చెప్పానని, అయినా అందరినీ కాదని ఇస్తే పార్టీ మారడం ఎంతవరకు సమంజసమన్నారు. కడియం ఈ స్థాయిలో ఉండటానికి తానే కారణమని.. నాడు ఎన్టీఆర్‌కు చెప్పి ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఇప్పించానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియం ఉన్నా, ఆయన కూతురు ఉన్నా ఓడించడంలో ముందుంటానని దయాకర్‌రావు పేర్కొన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు కోసం పార్టీ పక్షాన స్పీకర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎమ్మెల్సీ మధుసూధనాచారి మాట్లాడుతూ కూతురును అడ్డుపెట్టుకుని కడియం శ్రీహరి రాజకీయం చేస్తున్నాడని, ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కడియం శ్రీహరిలాంటి ముసలోళ్ల పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని, తమతో కావ్యను గెలిపించాలని చెప్పి.. తెల్లారే ప్లేట్ ఫిరాయించాడని ఆరోపించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా కడియం శ్రీహరి పార్టీ మారేందుకు ప్రయత్నిస్తతన్నాడని, బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన కడియం చస్తే.. ఆయన ముగ్గురు బిడ్డలు మాత్రమే పాడె మోయాల్సి వస్తుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నీతి గురించి చెప్పే కడియం.. దేవునూరులో భూమి ఎలా కొన్నాడో.. ఇల్లు ఎలా కట్టాడో అందరికీ తెలుసన్నారు. నాడు ఎన్టీఆర్, చంద్రబాబుకు ఈరోజు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడని విమర్శించారు. స్టేషన్‌ఘనపూర్ ప్రజలకు తాను అండగా ఉంటానన్నారు. దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ కడియం జీవితమంతా నీచ చరిత్రేనని, దళితుడని అని చెప్పుకొనే ఆయన.. ఏరోజు దళితులను చేరదీయలేదన్నారు. కడియం ఇబ్బందులు భరించలేకనే రాజయ్య, అరూరి రమేశ్, పసునూరి దయాకర్ బీఆర్ఎస్‌ను వీడారన్నారు. ఇన్ని పార్టీలు మారిన కడియం.. కేఏపాల్ ప్రజాశాంతి పార్టీకి కూడా పోతాడని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, జడ్పీ చైర్మన్‌లు సుధీర్‌కుమార్, గండ్రజ్యోతి, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, లలితాయాదవ్, హరిరమాదేవి, ఇండ్ల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో జయశ్రీ

చిట్యాల, ఏప్రిల్ 1: ఎంపీబీవోగా టి.జయశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రామయ్య రెండు రోజుల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో చిట్యాల ఎంపీడీవోగా టి.జయశ్రీ బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపీడీవోకు కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 1: మండలంలోని రౌడీషీటర్లు చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, దానికి భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్సై అశోక్ హెచ్చరించారు. త్వరలో జరుగనున్న ఎంపీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి తహసీల్దార్ సునీత ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వివిధ కారణాలు, నేర ప్రవృత్తి కారణంగా, చెడునడత కలిగిన వారిగా గుర్తించి రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. దీంతో పోలీసుల నిఘా ఉంటుందని అన్నారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయతే చర్యలు తప్పవని అన్నారు.